

దుకాణం సర్దుకోండి..!

కనిగిరిలో వందకుపైగా బడ్డీబంకులు తొలగించేందుకు మున్సిపల్ అధికారులు రంగం సిద్ధం చేశారు. 30 ఏళ్లుగా నడుస్తున్న బంకుల తొలగింపుపై నిరసన వ్యక్తమవుతోంది. - 8లో..



లారీ ఢీకొని దంపతులు దుర్మరణం

కుమార్తె వద్దకు వచ్చి బైక్‌పై తిరిగి వెళ్తున్న దంపతులను రాంగ్ రూట్‌లో వచ్చిన లారీ ఢీకొట్టింది. వారిపైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
37/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి

ఒంగోలు అర్బన్: రక్తదానంతో ప్రాణదానం చేయచ్చని.. ముఖ్యంగా యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ కోరారు. ఈ నెల 14వ తేదీ ప్రకాశం భవనం ప్రాంగణంలోని స్పందన భవనంలో రెడ్‌క్రాస్, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదానం చేయడం వలన ఆరోగ్యం బాగుంటుందని దీంతో పాటు అత్యవసర పరిస్థితిలో ఉన్న తోటి వ్యక్తులకు ప్రాణదానం చేసినట్లు అవుతుందన్నారు.

బీ ఫార్మసీ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి

ఒంగోలు: బీ ఫార్మసీ మొదటి సెమిస్టర్ ఫలితాలను ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి గురువారం తన చాంబర్‌లో విడుదల చేశారు. యూనివర్సిటీ పరిధిలో మొత్తం నాలుగు ఫార్మసీ కాలేజీలు ఉన్నాయని, వాటి పరిధిలో 275 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. వారిలో 136 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. మార్కాపురంలోని డాక్టర్ శామ్యూల్ జార్జి ఫార్మసీ కాలేజీకి చెందిన విద్యార్థినులు దాసరి స్మిలి (8.19), షేక్ మల్లికా నస్రీన్(8.18), కొప్పుల హర్షిత (8.05) వరుస ర్యాంకులు సాధించారని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ కేవీఎస్ రాజు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వీసీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏకేయూ పీజీ కోర్సుల విభాగం సీటీపీ డాక్టర్ జి.సోమశేఖర్, ఏసీటీపీ డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

చీమకుర్తి: మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి రవితేజ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతనూతలపాడు మండలంలోని ఎండ్లూరు డొంక పరిధిలో గల మహిళా ప్రాంగణంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. రెండు నెలల పాటు ఇచ్చే శిక్షణ కార్యక్రమంలో పాల్గొనే మహిళలు 15 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు గల వారై ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9963005209 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆపద్బాంధవుడు

రుధిర దాత..

దేవుడు మనిషికి జన్మనిస్తే.. రక్తదానంతో పునర్జన్మనిస్తున్నారు రక్తదాతలు. అన్ని దానాల్లోనూ రక్తదానం అపురూపం. అత్యవసర శస్త్ర చికిత్సలు, రోడ్డు ప్రమాదాలు, క్యాన్సర్, తలసేమియా వంటి అనారోగ్య పరిస్థితుల్లో రక్తం ఎక్కించడం ఎంతో అవసరం. విపత్కర పరిస్థితుల్లో సకాలంలో రక్తం లభించకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్నో కుటుంబాలు ఆసరా కోల్పోతున్నాయి. మరెంతో మంది చిన్నారులు అనాథలవుతున్నారు. అందుకే ఆపదలో ఉన్న వ్యక్తికి రక్తదానం చేయడం ప్రతిఒక్కరి బాధ్యత. మేమున్నాం అంటూ ప్రాణాలు కాపాడుతూ స్ఫూర్తిదాతలుగా నిలుస్తున్నారు రక్తదాతలు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- రక్తం దానమిస్తూ.. ఎందరికో ప్రాణాలు పోస్తూ
- జిల్లాలో ఒక రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు, 3 ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు
- ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులే ప్రధాన దాతలు
- ప్రతి ఏడాది రక్తదానం చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్
- త్వరలో రూ.3.5 కోట్లతో కాంపోనెంట్ యూనిట్ ప్రారంభం
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



ఒంగోలు టౌన్: రక్తదాతలు..ప్రాణదాతలు అంటారు. అత్యవసర సమయాల్లో స్పందించి రక్తాన్ని ఇచ్చేవారు కొందరైతే..అత్యవసర పరిస్థితుల్లో ఎవరికో ఒకరికి ఉపయోగపడుతుందని స్వచ్ఛందంగా వెళ్లి దానం చేసే వారు మరికొందరు. ప్రాణాపాయంలో ఉన్నవారికి రక్తం ఎంతోముఖ్యం అన్న అంశంపై ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అనేక ఏళ్లుగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. స్వయంగా బ్లడ్ బ్యాంకులు ఏర్పాటు చేసి అవసరమైన వారికి రక్తం అందజేస్తోంది. కలెక్టర్ అధ్యక్షుడిగా వ్యవహరించే రెడ్‌క్రాస్‌ను ఒంగోలు నగరంలో 1945వ సంవత్సరంలో ప్రారంభించారు. అప్పటి నుంచి అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తోంది. 1996వ సంవత్సరంలో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేశారు. అప్పటి వరకు జిల్లాలో ఎక్కడా బ్లడ్ బ్యాంకులు లేవు. నాటి నుంచి నేటి వరకూ ఈ బ్లడ్ బ్యాంకు కొన్ని వేల మందికి రక్తం అందజేసింది. ఇప్పటికీ అందజేస్తోంది. నగరంలో ఎవరికైనా రక్తం అవసరమైతే మొదట రెడ్‌క్రాస్ వద్దకే వస్తుంటారు. ప్రస్తుతం ఒంగోలులోని రెడ్‌క్రాస్ నెలకు 200 యూనిట్ల రక్తం అందజేస్తోంది.

రూ.3.5 కోట్లతో కాంపోనెంట్ యూనిట్ ప్రారంభం...

ఒంగోలు నగరంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ప్రారంభించి 30 ఏళ్లు కావస్తున్నప్పటికీ హోల్ బ్లడ్ యూనిట్‌గానే కొనసాగుతోంది. అంటే రక్తం ప్యాకెట్లలో అందజేస్తుంది. ఇప్పుడు వైద్య విజ్ఞానం ఎంతో పెరిగింది. రక్తం నుంచి రక్త కణాలు, ప్లాస్మా, సీరం వేరు చేసి ఒకేసారి ముగ్గురికి ప్రాణం పోస్తున్నారు. ఈ విధానాన్ని వైద్యులు కాంపోనెంట్ విధానం అని పిలుస్తారు. ఒంగోలులోని రెడ్ క్రాస్ ఆధ్వర్యంలోని బ్లడ్ బ్యాంకులో కూడా కాంపోనెంట్ విధానాన్ని అమలు చేయాలని జాతీయ రెడ్‌క్రాస్ నిర్ణయించింది. ఆ మేరకు 3.5 కోట్ల రూపాయల ఖరీదు చేసే అత్యంత ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చింది. వైద్య పరికరాలు ఒంగోలు చేరుకున్నాయి. ఏడాదిన్నర అవుతుంది. సంబంధిత అధికారులు వచ్చి తనిఖీలు చేయడం కూడా జరిగింది. అయితే అధికారుల నిర్లక్ష్యం పుణ్యమా అని ఢిల్లీ నుంచి తగిన అనుమతులు రాలేదు. దాంతో రోగుల ప్రాణాలు కాపాడేందుకు అవసరమైన కాంపోనెంట్ యూనిట్ ప్రారంభోత్సవం కోసం ఎదురు చూపులు చూస్తోంది. త్వరలోనే ఈ యూనిట్‌ను ప్రారంభించేందుకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తగిన చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ యూనిట్ ప్రారంభిస్తే మరింత మందికి రక్తదానం చేసేందుకు అవకాశం ఉంటుంది.



విద్యార్థులే ప్రధాన రక్తదాతలు...

ఒంగోలు నగరంలో పేరుకు అనేక స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయి. కానీ, స్వచ్ఛందంగా రక్తదానం చేసే వారు చాలా తక్కువగా ఉన్నారు. 1996లో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ప్రారంభించక ముందు 1985 ప్రాంతంలో కొందరు యువకులు కలిసి బ్లడ్ డొనేషన్ క్లబ్ స్థాపించి స్వచ్ఛందంగా రక్తదానం చేసేవారు. ఎవరికైనా రక్తం అవసరమైతే క్షణాల్లో వచ్చి వాలిపోయేవారు. ఒక్క రూపాయి తీసుకోకుండా రక్తదానం చేసేవారు. ఇప్పుడు ఒంగోలులో అలాంటి పరిస్థితి లేదు. దీంతో ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థుల్లో అవగాహన కల్పించడం ద్వారా రెడ్‌క్రాస్ రక్తం సేకరిస్తోంది. అందుకే కాలేజీలు నడుస్తున్నంత సేపు రక్తం కొరత ఉండటం లేదు. వేసవిలో కాలేజీలకు సెలవులు రావడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోతున్నారు. తిరిగి 2 నెలల వరకు రావడం లేదు. దాంతో రక్తం లభించక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఒంగోలులో రక్తం కొరత ఏర్పడటానికి ఇదీ కారణం.

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం...


జూన్ 14 ప్రపంచ రక్తదాతల దినోత్సవం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని స్పందన సమావేశ మందిరంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా తరచూ రక్తదానం చేస్తున్న స్వచ్ఛంద దాతలను, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న సంస్థలను సత్కరించనున్నారు. అలాగే, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ రక్తదానం చేయనున్నారు. ప్రతి ఏటా రక్తదాతల దినోత్సవం రోజు కలెక్టర్ రక్తదానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రజలకు స్ఫూర్తినిచ్చేందుకుగానూ కలెక్టర్ స్వయంగా రక్తదానం చేస్తున్నారు.

వయసు 27.. 25 సార్లు రక్తదానం...



ఈ యువకుడి పేరు శబరీనాథ్ పి.నాయర్. వయసు 27 సంవత్సరాలు. ఇప్పటి వరకు 25 సార్లు రక్తదానం చేశారు. ప్రస్తుతం మాంటిస్సోరి విద్యాసంస్థ కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తున్న శబరీనాథ్ మీద తండ్రి ప్రకాష్ ప్రభావం చాలా ఉంది. ప్రస్తుతం ప్రకాష్ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన గత 40 ఏళ్లకుపైగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒంగోలులో బ్లడ్ డొనేషన్ క్లబ్ ఏర్పాటు చేసింది కూడా ఆయనే. ఆయన ప్రభావంతోనే శబరీనాథ్ రక్తదానం చేయడం ప్రారంభించారు. డిగ్రీ చదువుతున్న సమయంలో రోటరీ క్లబ్ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఆ తరువాత కూడా ప్రతి 3 నెలలకోసారి రక్తదానం చేస్తున్నారు. శబరీనాథ్‌కు జనవరిలో వివాహమైంది. ఆయన భార్య ఈష చేత కూడా రక్తదానం చేయించి స్ఫూర్తిగా నిలిచాడు.

2 వేల యూనిట్లకుపైగా రక్తం సేకరణ...



ఈయన పేరు మంగళగిరి నరసింహారావు. నాలుగేళ్ల క్రితం రెడ్‌క్రాస్‌లో చేరారు. చుట్టూ ఉన్న వారు సకాలంలో రక్తం లభించక ప్రాణాలు కోల్పోవడం చూసి చలించిపోయారు. తనకు చేతనైన పని చేయాలని నిర్ణయించుకున్న ఆయన.. ఇప్పటి వరకూ 2 వేల యూనిట్లకుపైగా రక్తం సేకరించారు. తనకు తెలిసిన స్నేహితుల ద్వారా, సంస్థల ద్వారా, లయన్స్ క్లబ్ ద్వారా అనేక రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయించి రక్తం సేకరిస్తున్నారు. స్వయంగా 6 సార్లు ఈయన రక్తం దానం చేశారు. రక్తదానం చేయడం వలన ఆరోగ్యం మరింత మెరుగవుతుందని ఆయన చెబుతుంటారు.

బ్లడ్ బ్యాంకులు 5 మాత్రమే..

జిల్లా కేంద్రమైన ఒంగోలులో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఒకటి, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మరొకటి బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి. ఇక, ప్రైవేటు రంగంలో మరో మూడు బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి. ప్రతిరోజూ కనీసం వంద యూనిట్లకుపైగా రక్తం అవసరమని వైద్యులు చెబుతున్నారు. కానీ, అవసరమైనంత రక్తం అందుబాటులో ఉండటం లేదు. ప్రతి ఏడాది వేసవిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం రెడ్‌క్రాస్‌లో ఏ పాజిటివ్ రక్తం 3 యూనిట్లు మాత్రమే అందుబాటులో ఉంది. బీ పాజిటివ్ రక్తం 10 యూనిట్లు, ఏబీ పాజిటివ్ రక్తం 1 యూనిట్, ఓ పాజిటివ్ 15 యూనిట్లు మాత్రమే అందుబాటులో ఉంది. ఓ నెగిటివ్ 1 యూనిట్ మినహా మిగిలిన ఏ, బీ, ఏబీ నెగిటివ్ గ్రూపుల రక్తం కనీసం ఒక్క యూనిట్ కూడా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగించే అంశంగా చెప్పవచ్చు.

25 సార్లు రక్తమిచ్చాను



నా పేరు ఆరీఫుద్దీన్. ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నా. యువకేర్ స్వచ్ఛంద సంస్థ స్థాపించి రక్తదానంతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నా. నా బ్లడ్ గ్రూపు ఏ పాజిటివ్. ఇప్పటి వరకూ 25 సార్లు రక్తమిచ్చాను. ఇప్పుడిప్పుడే రక్తదానంపై యువతకు అవగాహన వస్తోంది. ఇప్పటివరకూ మా సంస్థ తరఫున ఐదేళ్లలో సుమారు 5 వేల మందికి రక్తం అందించాం.

– ఆరీఫుద్దీన్, మార్కాపురం

40 సార్లు రక్తదానం చేశా



నేను ఇప్పటి వరకు 40 సార్లు రక్తదానం చేయడంతో పాటు దాదాపు 25 సార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి బ్లడ్ బ్యాంక్‌కు రక్తం అందించాను. ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవు. యువత ముందుకు రావాలి. 2016 నుంచి బ్లడ్‌క్యాంపు నిర్వహిస్తున్నాను. 2005లో డిగ్రీ చదివేటప్పటి నుంచి రక్తదానం చేస్తున్నా. నా బ్లడ్ గ్రూప్ బీ పాజిటివ్.

– అనిల్, ఎన్‌ఆర్‌ఈజీ ఉద్యోగి









స్కూల్ బెల్ షురూ..!



బడి గంట మోగింది. విద్యార్థులతో పాఠశాలలన్నీ కళకళలాడాయి. వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు పునఃప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పుస్తకాలు, బ్యాగులు, ఇతర విద్యా సామగ్రితో కూడిన కిట్లు పాఠశాలలకు చేరుకున్నాయి. తొలిరోజు సరస్వతీ పూజలతో పాఠశాలల్లో కార్యకలాపాలు ప్రారంభించారు. మరోవైపు అడ్మిషన్ల ప్రక్రియ ఊపందుకుంది. తొలిరోజు 1,06,719 మంది విద్యార్థులకుగానూ 78,817 మంది పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేశారు. అడ్మిషన్లు, విద్యార్థులకు కిట్ల పంపిణీ, తరగతుల నిర్వహణ, తదితర కార్యక్రమాలతో తొలిరోజు ఉపాధ్యాయులు బిజీబిజీగా గడిపారు.

– ఒంగోలు









అందరి కృషితో విజయవంతంగా ఎన్నికలు

- అధికారులతో కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కొత్తపట్నం: అధికారులందరి సమష్టి కృషితో జిల్లాలో ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా ముగిసిందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఆర్‌ఓలు, వివిధ శాఖలకు చెందిన నోడల్ ఆఫీసర్లు, ఏఆర్‌వోలు, ఇతర శాఖల జిల్లా అధికారులు, సిబ్బందికి గురువారం స్థానిక నల్లూరి గార్డెన్స్ రిసార్ట్స్‌లో కలెక్టర్ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అవసరమైన పకడ్బందీ ప్రణాళిక రూపకల్పన, దాని అమలును నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించగలిగామన్నారు. జిల్లా స్థాయి మొదలుకుని గ్రామ స్థాయి వరకు అధికారులు, సిబ్బందికి ఆ దిశగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్నికల ప్రక్రియ ముగియడంతో పాటు పోలింగ్ శాతంలో రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి ఆయన ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కలెక్టర్ ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేయడం వలన తమ విధులను విజయవంతంగా నిర్వహించగలిగామన్నారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయడం వలన శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం కలగలేదన్నారు. ఓటర్లు కూడా పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించడం వలన ఎన్నికలు సజావుగా జరిగాయన్నారు. అనంతరం జిల్లా స్థాయి అధికారులంతా కలెక్టర్, ఎస్పీలను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

జంతు హింసకు పాల్పడవద్దు

- జిల్లా పశుసంవర్థక శాఖాధికారి బేబీరాణి



ఒంగోలు సెంట్రల్: పండుగలను పురస్కరించుకుని ఆవులు, లేగ దూడల సామూహిక వధ జరిగే అవకాశం ఉన్నందున అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా పశుసంవర్థక శాఖాధికారి కె.బేబీరాణి హెచ్చరించారు. సామూహికంగా ఆవులు, లేగ దూడలను వధించడం జంతు హింస నివారణ చట్టం, గోవధ నిరోధక చట్టం, పశువుల రవాణా నియమావళి, సుప్రీంకోర్టు, హైకోర్టుల ఉత్తర్వుల ప్రకారం చట్ట విరుద్ధమని వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఇటువంటి చర్యలకు ఉపక్రమించిన, సహకరించిన వారంతా చట్టప్రకారం శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. పశుపోషకులు ఎవరూ సామూహిక వధ కోసం పశువులను అమ్మవద్దని, రవాణాలలో పాలుపంచుకోవద్దని కోరారు. జంతు హింసకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

పొగాకు గరిష్ట ధర రూ.332

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు పొగాకు బోర్డు పరిధిలో పొగాకు కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నట్లు ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో గురువారం 9,071 బేళ్లు వేలానికి రాగా, 8,321 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 780 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో ఫిబ్రవరి 29న మొదలైన వేలం 80వ రోజు కొనసాగింది. 5,059 బేళ్లు వేలానికి రాగా, 4,641 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 398 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.331 పలకగా, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.280.24 పలికింది. అదేవిధంగా మార్చి 6న ప్రారంభమైన డీసీ పల్లి, కలిగిరి, కందుకూరు-2, ఒంగోలు-2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర వేలం కేంద్రాల్లో 75వ రోజు వేలం పాట సాగింది. ఆయా కేంద్రాల్లో 4,012 బేళ్లు వేలానికి రాగా, 3,680 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 382 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.332, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.280.19 దక్కినట్లు ఆర్‌ఎం వివరించారు.

క్లుప్తంగా

అక్రమ మద్యం కేసులో ముగ్గురికి జైలు

ఒంగోలు టౌన్: అక్రమ మద్యం కేసులో ముగ్గురు నిందితులకు న్యాయస్థానం జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఒంగోలు నగరంలోని సీతారాంపురం వీధిలోని ఒక ఇంటిలో పుదుచ్చేరి రాష్ట్రానికి చెందిన మద్యాన్ని విక్రయిస్తున్న శెట్టి శ్రీకాంత్, శెట్టి వంశీ, పోతూరి అమృతరాజును స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. వారి నుంచి 750 మి.లీ పరిమాణం కలిగిన 42 మద్యం సీసాలు, 10 వేల రూపాయల నగదు, ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. 2021కి చెందిన ఈ కేసులో ప్రకాశం జిల్లా ఎక్సైజ్ కోర్టు ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ రెండేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ కె.శ్రావణ్ కుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించినట్లు ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ తెలిపారు.

బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలంలోని గజ్జలకొండ పంచాయతీ పిచ్చిగుంటపల్లి గ్రామంలో బావిలో మృతదేహాన్ని గురువారం ఉదయం గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు 20 నుంచి 30 రోజుల క్రితం బావిలో పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు విచారణ ప్రారంభించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దుకాణం సర్దుకోండి..!

- కనిగిరిలో 100 బడ్డీ బంకులు తొలగించేందుకు మున్సిపల్ అధికారుల చర్యలు
- మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో 30 ఏళ్లుగా నడుస్తున్న దుకాణాలు
- పొట్ట కొట్టొద్దంటూ మున్సిపల్ కార్యాలయం వద్ద చిరు వ్యాపారుల నిరసన
- బంకులు తొలగిస్తే విషం తాగి చనిపోతామని బాధితుల ఆవేదన
- ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తప్పవన్న కమిషనర్
- అధికారులకు సహకరించాలని ఎమ్మెల్యే ఉగ్ర ఉచిత సలహా


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బడ్డీ బంకుల యూనియన్ నాయకులు

కనిగిరి రూరల్

కనిగిరిలో గురువారం ఒక్కసారిగా అలజడి రేగింది. కనిగిరి మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లో ఏళ్ల తరబడి చిరువ్యాపారాలు నిర్వహించుకుంటున్న దుకాణదారులను ఖాళీ చేయించేందుకు అధికారులు ప్రయత్నించడంతో బాధితులంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సుమారు 100 మంది చిరు వ్యాపారులు మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు.

"30 ఏళ్ల నుంచి రోడ్ల పక్కన దుకాణాలు పెట్టుకుని జీవిస్తున్నాం. మేమంతా బీసీ, మైనార్టీ, ఎస్సీ వర్గాలకు చెందినవారం. మాకు వేరే బతుకు దెరువు లేదు. ఒక్కసారిగా మమ్మల్ని ఖాళీ చేసి వెళ్లిపొమ్మంటే ఎలా.. మీరు బలవంతంగా దుకాణాలు తొలగించాలని చూస్తే విషంగా తాగి చస్తాం" అని పలువురు దుకాణదారులు కన్నీటి పర్యంతమయ్యారు.

30 ఏళ్ల నుంచి కదిలించని పాలకులు

వాస్తవానికి దివంగత మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతి నాయుడు హయాంలో రోడ్ల విస్తరణ కార్యక్రమం చేపట్టారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఓవీ రోడ్డు నుంచి చెప్పుల బజార్ మీదుగా గార్లపేట రోడ్డు వరకు సీసీ రోడ్డు వేశారు. ఈ క్రమంలో అప్పట్లో ఆర్‌అండ్‌బీ అధికారులు చర్చికి అనుకుని ఫుట్ పాత్‌పై ఉన్న బంకులు తొలగించాలని ప్రయత్నించారు. అయితే నిరుపేద కుటుంబాలు బీసీ, మైనార్టీ, ఎస్సీ వర్గాలకు చెందిన వారు కావడంతో అప్పటి ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతినాయుడు అధికారుల చర్యను వారించారు. చిరువ్యాపారులకు అండగా నిలిచి ఫుట్‌పాత్ పైనుంచి కిందికి రాకుండా బంకులు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి నాలుగు పర్యాయాలు ప్రభుత్వాలు మారినా ఇక్కడ వ్యాపారుల జోలికి వెళ్లలేదు. కానీ ఇప్పుడు అధికారులు ఒక్కసారిగా దాడికి దిగారు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా.. కనీసం సమాచారం ఇవ్వకుండా బంకులు తీసివేయాలని ఒత్తిడి చేయడం దుర్మార్గమని చిరు వ్యాపారులు వాపోతున్నారు.

కమిషనర్ అత్యుత్సాహం

పట్టణంలో ట్రాఫిక్ సమస్య నేపథ్యంలో ఆక్రమణలు తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు చెబుతున్నారు. ఓవీ రోడ్డులోని ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌పై కొంత ఆక్రమణలు ఉన్నాయని.. బైపాస్ రోడ్డు వేసే వరకు ఆక్రమణలు తొలగిస్తామని చెప్పి ఒక్కసారిగా చెప్పుల బజార్‌లోని బంకులపై ప్రతాపం చూపుతున్నారు. వాస్తవానికి చెప్పుల బజార్‌లో వాహనాల రాకపోకలకు కొంత ఇబ్బంది ఉన్నా.. పోలీస్ శాఖ వన్ వే మార్గాలు ఏర్పాటు చేయడంతో ఆ సమస్యకు కాస్త చెక్ పడింది. అయినా కమిషనర్ దుకాణాలు తొలగించేందుకు అత్యుత్సాహం చూపడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజా సంఘాలతో కలిసి పోరాటం!

అధికారాన్ని అడ్డుపెట్టుకుని దౌర్జన్యంగా వ్యవహరించి తమ బంకులను తొలగించేందుకు కమిషనర్ ప్రయత్నిస్తే నిరసన తెలిపేందుకు చిరు వ్యాపారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పట్టణంలోని చిరువ్యాపారులు, బడ్డీ బంకుల నిర్వాహకులు యూనియన్లుగా ఏర్పడి ఉన్నారు. మరోసారి ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు సమస్యను వివరించి, అప్పటికీ న్యాయం జరగకపోతే.. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఇతర ప్రజా సంఘాల మద్దతుతో న్యాయ పోరాటం చేసేందుకు బాధితులు సన్నద్ధమయ్యారు.


ఆవేదన వ్యక్తం చేస్తున్న చిరువ్యాపారులు


కనిగిరి మున్సిపల్ కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న బాధితులు

తలలు పట్టుకుంటున్న టీడీపీ నేతలు

పట్టణంలోని ప్రధాన రహదారుల పక్కన ఫుట్‌పాత్‌లపై సుమారు 300కు పైగా బడ్డీ, కిల్లీ, చికెన్ పకోడా, తాళాల మరమ్మతులు, వాచీ షాప్‌లు, పండ్ల వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు ఇలా అనేక రకాల దుకాణాలు పెట్టుకుని జీవిస్తున్నారు. అలాగే చెప్పుల బజార్‌లో సుమారు 100కు పైగా దుకాణాలు చర్చి గోడకు అనుకుని ఏర్పాటు చేసుకున్నారు. ఈ బంకుల నిర్వాహకుల్లో అన్ని పార్టీలకు చెందిన అభిమానులు ఉన్నారు. వాస్తవానికి టీడీపీ సానుభూతిపరులే ఎక్కువ మంది ఉన్నారు. బంకులను తొలగిస్తే అనేక మంది జీవితాలు రోడ్డున పడతాయి. సుమారు 30 ఏళ్ల నుంచి సాఫీగా సాగుతున్న దుకాణాలను టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వారం రోజుల్లోనే తొలగించాలని చూడటంతో ఆ పార్టీ నేతలే తలలు పట్టుకుంటున్నారు. అధికారుల చర్యతో హడలిపోయిన కొందరు చిరు వ్యాపారులు టీడీపీ నేతలను నిలదీశారు.

పట్టించుకోని ఎమ్మెల్యే ఉగ్ర

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉదయం కమిషనర్ టీవీ రంగారావును కలిసిన బాధితులు తమ దుకాణాలు తొలగించి రోడ్డుపాలు చేయవద్దని వినతిపత్రం అందజేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ గఫార్‌కు కలిసి విన్నవించగా.. బంకులు తొలగించే విషయంలో తనకు ఎటువంటి సమాచారం లేదని, విచారించి చెబుతానన్నారు. గురువారం రాత్రి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని బాధిత చిరువ్యాపారులు కలిసి సమస్య తెలియజేశారు. 'ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ చెప్పారని.. మీరంతా సహకరించాల్సిందే' అని ఎమ్మెల్యే ఉగ్ర సెలవివ్వడంతో బాధితులు ఖంగుతిన్నారు.

నాడు అలా.. నేడు ఇలా..

- వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగి, సంఘ నాయకుడు కేఆర్ సూర్యనారాయణ వింత పోకడ
- సీఎం చంద్రబాబు పేరు చెప్పుకుంటూ అధికారులు, సిబ్బందికి బెదిరింపులు
- గతంలోనూ అవినీతి అక్రమాలకు పాల్పడి సస్పెన్షన్
- అతనిపై చర్యలు తీసుకోవాలంటున్న ది కమర్షియల్ ట్యాక్సెస్ నాన్‌గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నెల్లూరు డివిజన్ అధ్యక్షుడు ఎస్ఎల్ నరసింహారావు

ఒంగోలు సెంట్రల్: వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగిగా పనిచేస్తూ, సంఘ నాయకుడిగా చలామణి అవుతున్న కేఆర్ సూర్యనారాయణ పోకడ ప్రభుత్వం మారినప్పుడల్లా వింతగా మారుతోందని ది కమర్షియల్ ట్యాక్సెస్ నాన్‌గజిటెట్ ఆఫీసర్స్ అసోషియేషన్ నెల్లూరు డివిజన్ (నెల్లూరు, ప్రకాశం జిల్లాల) అధ్యక్షుడు ఎస్ఎల్ నరసింహారావు విమర్శించారు. గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన అభియోగంపై శాఖాపరమైన నివేదిక ఆధారంగా ప్రభుత్వం సూర్యనారాయణపై సస్పెన్షన్ వేటు వేసిందన్నారు. అందుకు సహకరించిన ఇతర ఉద్యోగులను కూడా సస్పెండ్ చేసిందని, వారంతా జైలు పాలు కాగా, సూర్యనారాయణ అజ్ఞాతంలోకి వెళ్లి అరెస్ట్ కాకుండా స్టే తెచ్చుకున్నాడని ఆరోపించారు. తన తోటి ఉద్యోగులను మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. అధికారులను బ్లాక్‌మెయిల్ చేసేందుకు నూతన ముఖ్యమంత్రితో ఫొటోలు దిగి కొత్త డ్రామాలకు తెరతీస్తున్నాడని విమర్శించారు. ఈ సంఘానికి ఆన్ డ్యూటీ (ఓడీ) సౌకర్యం లేకపోయినా ఇతర సంఘాలకు ఉన్న సౌకర్యాలను చట్టవిరుద్ధంగా పొందాడని ఆరోపించారు. 2023లో సూర్యనారాయణ సంఘ సభ్యుల అక్రమాలపై విజయవాడలో వర్తకులు తమను వేధిస్తున్న విధానాలపై ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. సూర్యనారాయణపై ఉన్న కేసులను క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడమే కాకుండా ఇతని సంఘం గుర్తింపును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పూర్తిగా నిలిచిన రైల్వే అభివృద్ధి పనులు


దొనకొండ రైల్వే స్టేషన్


స్టేషన్ ఎదురు నిలిచిన పనులు

దొనకొండ: అమృత భారత్ స్కీం కింద గుంటూరు రైల్వే డివిజన్‌లోని దొనకొండ రైల్వే స్టేషన్ ఆధునీకరణకు రూ.18 కోట్లు గతంలో మంజూరయ్యాయి. అధికారులు ఆ నిధులతో హడావిడిగా అభివృద్ధి పనులు చేపట్టారు. స్టేషన్ ఎదురుగా అందమైన పార్కు, పాదాచారులు నడవడానికి సీసీ రోడ్లు, సైడు కాలువలు, వాహనాల స్టాండ్ పనులు మొదలు పెట్టారు. మూడు నెలల నుంచి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా దొనకొండ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచి పోయాయి. పది శాతం పనులు కూడా అధికారులు చేపట్టలేదు. రైల్వే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎవరైనా అభివృద్ధి పనుల గురించి అడిగితే నిధులు లేవు, కాంట్రాక్టర్ ముందుకు రాలేదని మాట దాటేస్తున్నారు. గుంతకల్, హుబ్లీ, తిరుపతి, హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, ఒడిస్సా తదితర ప్రాంతాలకు రైళ్ళు నడుపుతున్నారు. రోజుకు 10 రైళ్ళు రాకపోకలు జరుగుతున్నాయి. దొనకొండ స్టేషన్ అభివృద్ధి పనులు అరకొరగా నిలిచి పోయాయి.

వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మృతి


దూదేకుల ప్రసాద్ (ఫైల్)


నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ

- ఘన నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని 23వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ దూదేకుల ప్రసాద్(54) అనారోగ్యంతో బుధవారం అర్ధరాత్రి గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో మృతి చెందారు. గత వారంరోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలలో చేరారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత మృతి చెందారు. మృతదేహాన్ని గురువారం వేకువజామున మార్కాపురం పట్టణంలోని ఆయన నివాసానికి తీసుకొచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కుందురు నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులతోపాటు పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, అధికారులు మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

లారీ ఢీకొని దంపతులు దుర్మరణం


లారీ ఢీకొట్టి మృతిచెందిన బత్తుల కొండలు, లక్ష్మి దంపతులు



లారీ ముందు భాగంలో కిందివైపు ఇరుక్కుపోయిన మోటారు బైకు

- రాంగ్ రూట్‌లో వచ్చి బైకును ఢీకొట్టిన లారీ
- కుమార్తెను చూసి తిరిగివెళ్తూ అనంతలోకాలకు దంపతులు

మేదరమెట్ల: కుమార్తెను చూసి తిరిగివెళ్తున్న దంపతులను జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వచ్చిన లారీ ఢీకొట్టడంతో దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం తిమ్మనపాలెం గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ఆ వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా సుబ్బారెడ్డికాలనీ రొంపిచర్ల గ్రామానికి చెందిన బత్తుల కొండలు (49), లక్ష్మి (41) దంపతులు ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండల కేంద్రంలో ఉంటున్న కుమార్తె వద్దకు వచ్చారు. గురువారం ఉదయం తిరిగి స్వగ్రామం వెళ్లేందుకు మోటారు బైకుపై బయలుదేరారు. తిమ్మనపాలెం గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా రాంగ్‌రూట్‌లో లారీ వచ్చి మోటారు బైకును ఢీకొట్టింది. బైకుపై ఉన్న దంపతులిద్దరూ రోడ్డుపై పడిపోయారు. వారి మీదుగా లారీ వెళ్లడంతో దంపతులిద్దరూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మోటారు బైకు లారీ ముందు భాగంలో కిందివైపు ఇరుక్కుపోయింది. సమాచారం అందుకున్న మేదరమెట్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతుల బంధువులకు సమాచారం అందజేశారు. అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డి ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. లారీ ఇడుపుగల్లు నుంచి కందుకూరుకు టైల్స్ లోడుతో వెళ్తున్నట్లు తెలిసింది.

నాడు-నేడు పనుల పరిశీలన

- పనుల పూర్తిపై డీఈఓ సంతృప్తి


కొత్తపట్నం హైస్కూల్లో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న డీఈఓ సుభద్ర

కొత్తపట్నం: నాడు-నేడు పనులు సకాలంలో పూర్తి చేయడంపై జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం కొత్తపట్నంలోని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరిల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫేస్-2 కింద చేపట్టిన అభివృద్ధి పనులను డీఈఓ డి.సుభద్ర, నాడు-నేడు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భాస్కర్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. పూర్తయిన గదుల్లో పాఠశాల తరగతులు నిర్వహించాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎం.శ్రీదేవిని ఆదేశించారు. ఏడు ఏసీఆర్ గదులకుగాను రెండు గదులకు మాత్రమే కిటికీలు వచ్చాయని తెలియజేయడంతో మిగిలిన వాటికి తాత్కాలికంగా కిటికీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని గదులకు వెంటనే తలుపులు బిగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎగ్జిక్యూటివవ్ ఇంజినీర్ భాస్కర్ బాబు మాట్లాడుతూ.. ల్యాండింగ్ అవసరం లేకుండా అదనపు తరగతి గదులను మధ్యలోనే శ్లాబ్‌తో జాయింట్ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ పద్మావతి, ఇన్‌చార్జి హెచ్ఎం ఎం.శ్రీదేవి, ఉపాధ్యాయుడు రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

- మార్కాపురం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజమన్నార్



మాట్లాడుతున్న డాక్టర్ సావిత్రి

మార్కాపురం: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని మార్కాపురం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీవీ నాగరాజమన్నార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సావిత్రి పేర్కొన్నారు. స్థానిక జీజీహెచ్‌లో క్యాన్సర్‌పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, నోటి క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు క్యాన్సర్ గురించి వివరించాలని వైద్యులకు సూచించారు.

విశాఖపట్నంలోని హోమీబాబా క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన ఒంగోలు ప్రభుత్వ వైద్యకళాశాల బృందం క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామీణ పట్టణ ప్రాంతాల వైద్యులు పాల్గొన్నారు. డీవైఎంహెచ్ఓ డాక్టర్ పద్మావతి, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భగీరథి, డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.